క్లుప్తంగా

నేటి నుంచి క్రికెట్ టోర్నీ ప్రారంభం

సీతారామపురం : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామంలో బుధవారం నుంచి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,116, ద్వితీయ బహుమతిగా రూ.15,116, తృతీయ బహుమతిగా రూ.10,116 నగదును అందిస్తామన్నారు. టోర్నీలో పాల్గొనదలచిన వారు ఎంట్రీ ఫీజు రూ.500తో పాటు, బాల్ ఫీజు రూ.100 చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 89783 93015, 93602 95112 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఉదయగిరి(వింజమూరు) : వింజమూరు పట్టణంలోని పాతూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైద్యుడు మాసిలామణి, ఉపాధ్యాయులు పర్వతరెడ్డి కొండారెడ్డి, వెంకటసుబ్బయ్య, జూపల్లి వెంకటేశ్వర్లు, చంద్రన్, శైలజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

ఉదయగిరి : బడి ఈడు పిల్లలను హెచ్‌ఎంలు గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పాఠశాలకు ప్రహరీ లేని అంశాన్ని గుర్తించి కొలతలు వేయించి తెలపాలని హెచ్‌ఎం జ్యోతికి సూచించారు. ఆయన వెంట సీఆర్‌ఎంటీ ఇనాయతుల్లా పాల్గొన్నారు.

సన్మానం



ఉదయగిరి(వింజమూరు) : మండలంలోని కాటేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అంకినపల్లి లక్ష్మిరెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం పాఠశాలలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉపాధ్యాయులు ఆయన సేవలను కొనియాడారు. శాలువలు, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

30 నుంచి అంకాళమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

వరికుంటపాడు : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో ఈనెల 30 నుంచి మే 4వ తేదీ వరకు గ్రామదేవత అంకాళమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఉదయగిరి : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ సామ్రాజ్యం వార్డు సభ్యులతో కలిసి చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణ వాసులు, పాదచారులు, వాహనచోదకుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్, డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా, ఎంపీటీసీ జి.తిరుపతి, జనవిజ్ఞాన వేదిక నాయకుడు దస్తగిరి అహ్మద్, నాయకులు గడియాల్చి యస్దాని, రియాజ్, షేక్.యస్దాని, హరి, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

కాన్పులా.. జిల్లా ఆస్పత్రికి వెళ్లండి

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రసవాలకు దూరంగా ఉంటున్నాయి. గర్భిణులు సాధారణ నొప్పులతో వచ్చినా హైరిస్క్ అంటూ జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. దీంతో పీహెచ్‌సీల్లో ఏడాదికి కనీసం పది ప్రసవాలైనా చేయాలని లక్ష్యం విధిస్తున్నా.. దానిని కూడా అందుకోలేని స్థితిలో ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.

- పీహెచ్‌సీల్లో జాడలేని ప్రసవాలు
- ఏడాదికి పది కూడా చేయని వైనం
- పట్టణంలోని జిల్లా ఆస్పత్రే దిక్కు



ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రి

ఆత్మకూరు : గ్రామాల్లో, మండల కేంద్రాల్లో ఉన్న పీహెచ్‌సీల్లో తప్పనిసరిగా ప్రసవాలు నిర్వహించాలని, తల్లీబిడ్డ సంక్షేమం తప్పనిసరిగా పరిశీలించాలని ప్రభుత్వం ఓ వైపు ప్రకటనలు చేస్తున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో ప్రసవాలు చేసే స్థితిలో పీహెచ్‌సీలు ఉండడం లేదు.

అతివృష్టి, అనావృష్టి

గ్రామాల్లోని పీహెచ్‌సీల్లో కాన్పుల పరిస్థితి అనావృష్టిలా ఉంటే.. ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పరిస్థితి అతివృష్టిలా ఉంది. పీహెచ్‌సీల్లో కాన్పులు చేయకుండా జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేయడంతో ఇక్కడి ఆస్పత్రి తక్కువ సిబ్బందితో అధిక కాన్పులు చేస్తోంది. ఇలా గతేడాది 1800 పైగా కాన్పులు ఆత్మకూరు ఆస్పత్రిలో జరిగింది.



జూనియర్ డాక్టర్ పద్మావతితో కలిసి వైద్యసేవలు అందించే గైనకాలజిస్ట్ కిరణ్మయి

నియోజకవర్గంలో 11 పీహెచ్‌సీలు

ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 11 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో ఆరు పీహెచ్‌సీలు 24 గంటలు పనిచేసేవి కాగా, ఐదు పగటి వేళల్లో మాత్రమే వైద్యసేవలు అందిస్తాయి. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామీణ ప్రాంత గర్భిణులు ప్రసవాల సమయంలో వైద్యపరంగా ఇబ్బందిపడకుండా ఉండేందుకు పీహెచ్‌సీల్లో కాన్పులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే అవి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. 24 గంటల వైద్యసేవలు అందుబాటులో ఉండే ఆరు పీహెచ్‌సీల్లో కూడా చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాత్రమే లక్ష్యం మేరకు కాన్పులు జరిగాయి. పీహెచ్‌సీలకు గర్భిణులు వస్తున్న క్రమంలో చిన్న అనారోగ్య కారణాలను కూడా పెద్దవి చేసి చెబుతూ 'హైరిస్క్' కేసులు అని, ఆత్మకూరుకు లేదా నెల్లూరుకు వెళ్లాలని డాక్టర్లు, సిబ్బంది చెప్పి పంపేస్తున్నారు. దీంతో సులభంగా కాన్పులు అయ్యే కేసులు సైతం దూరంగా ఉన్న ఆత్మకూరు, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఆత్మకూరులోనూ సిబ్బంది కొరత

ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నా గైనిక్ డాక్టర్ ఒక్కరే ఉండడంతో ఇబ్బందులు పడుతూ లక్ష్యాన్ని మించి కాన్పులు చేస్తున్నారు. వాస్తవానికి ముగ్గురు గైనిక్ డాక్టర్లు ఉండాల్సిన ఈ ఆస్పత్రిలో ఒక్క గైనిక్ డాక్టర్ కిరణ్మయి విధులు నిర్వహిస్తున్నారు. అధిక ఒత్తిడి రీత్యా ఓ జూనియర్ డాక్టర్ పద్మావతిని తాత్కాలికంగా సహాయకురాలిగా తెచ్చుకొని విధులు నిర్వహిస్తున్నారు.

ఒత్తిడి తప్పడం లేదు

ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఉన్న సిబ్బందితోనే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. ఆత్మకూరుతో పాటు దూర ప్రాంతాలైన ఉదయగిరి, బద్వేల్, మైదుకూరుల నుంచి కాన్పుల కోసం ఇక్కడికి వస్తుంటారు. గైనిక్ విభాగంలో డాక్టర్ల కొరత ఉంది. అయినా ఒక్క డాక్టర్‌తోనే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ ఉషాసుందరి, ఆర్‌ఎంఓ, ఆత్మకూరు



చంటి పిల్లలకు వైద్యసేవలు అందించే ఎస్‌ఎన్‌సీయూ విభాగం

చంటి పిల్లలకు..

కాన్పులు అయిన తరువాత చంటి బిడ్డలకు ఏర్పడే ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం పురిటి విభాగం ఎస్‌ఎన్‌సీయూ వైద్యం ఆత్మకూరు ఆస్పత్రిలో అందుబాటులో ఉంది. 15 పడకల అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ చంటి పిల్లలకు పూర్తిస్థాయి వైద్యం అందుబాటులో ఉండడంతో అధిక శాతం గర్భిణులు కాన్పుల కోసం ఆత్మకూరు ఆస్పత్రికి రావడం పరిపాటిగా మారింది.

జూనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి



చంద్రశేఖర్‌కు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

సోమశిల : అనంతసాగరం మండలం సోమశిల ప్రాజెక్టు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ ఎస్‌ఈ బసిరెడ్డి వెంకటరమణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన్ను డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాస్‌కుమార్, డీఈఈ రవీంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



సీతారామపురం : మండల పరిధిలో ఎస్సై శివకృష్ణారెడ్డి మంగళవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేశారు. గంజాయి, మద్యం వంటి అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై అధికారుల పరిశీలన



నల్లగొండ్లలో అక్రమ మైనింగ్ చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వింజమూరు : మండలంలోని నల్లగొండ్ల గ్రామం వద్ద ఉన్న క్వారీలో అక్రమంగా గ్రావెల్, కంకర తరలిస్తున్న నేపథ్యంలో మైనింగ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం ఇక్కడ పరిశీలించిన సందర్భంగా అనుమతుల్లేకుండా తరలిస్తున్న వాహనాలను రెవెన్యూ, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో తహసీల్దార్ హమీద్ హుస్సేన్ మైనింగ్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్ కార్యాలయానికి చెందిన ఆర్‌ఐ చిలకపాటి స్వాతి మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సర్వే నంబర్ 36లో 68 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా గ్రావెల్, రఫ్‌స్టోన్ సుమారు 3,500 క్యూబిక్ మీటర్లు తరలించినట్లు గుర్తించారు. ఈ మేరకు మైనింగ్ డీడీ బాలాజీకి నివేదిక సమర్పించిస్తామని, తదుపరి చర్యలు ఆయన తీసుకుంటారని ఆమె వివరించారు. వీఆర్వో నారసింహారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పాత ట్రాన్స్‌ఫార్మర్లను మార్చండి

- ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో ఫిర్యాదు



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

ఆత్మకూరు : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని పలువురు అర్జీలు అందజేశారు. ఆత్మకూరు పట్టణంలోని డీఈఈ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను మంగళవారం నిర్వహించారు. అదాలత్ చైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి అధ్యక్షతన కమిటీ సభ్యులు కె.రామ్మోహన్‌రావు, ఎస్‌ఎల్ అంజనీకుమార్, విజయలక్ష్మి, డీఈఈ శ్రీనివాసరావులు అర్జీలు స్వీకరించారు. రైతు సంఘం నాయకులు, సీపీఎం నాయకులు పలు విద్యుత్ సమస్యల గురించి వారికి వివరించారు. అనంతరం శ్రీనివాస ఆంజనేయమూర్తి మాట్లాడుతూ త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేక్రమంలో వ్యవసాయ విద్యుత్ లైన్లు కొన్ని ప్రాంతాల్లో సక్రమంగా లేవని, స్తంభాలు ఒరిగి ఉన్న విషయాన్ని రైతు సంఘం నాయకులు కమిటీ దృష్టికి తీసుకొచ్చారన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ చిన్నస్వామి నాయక్, పట్టణ ఏఈ జమీలాబేగం, సీపీఎం, రైతు సంఘం నాయకులు డేవిడ్‌రాజు, సందానీబాషా, లక్కు ప్రసాద్, గుల్జార్ బేగం, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని విద్యుత్ శాఖ ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న సీఐ వేమారెడ్డి

అనుమసముద్రంపేట : డ్రోన్ కెమెరాల ద్వారా ఏఎస్‌పేట మండలంలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తామని సంగం సీఐ వేమారెడ్డి అన్నారు. డ్రోన్ కెమెరాల పనితీరుపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌పేట నుంచి సంగం వెళ్లే రహదారిలో డ్రోన్ కెమెరాల పని విధానాన్ని ఆయన పోలీస్ సిబ్బందికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసాంఘిక శక్తులపై డ్రోన్ కెమెరాల ద్వారా నిఘాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సై సైదులు, ఏఎస్సై భాస్కర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వేసవి సెలవుల్లో అప్రమత్తత అవసరం

సంగం : సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సీఐ వేమారెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. వేసవి సెలవులు వస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈత సరదాల కోసం కాలువల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు సెలవుల్లో తమ పిల్లలకు ఒంటరిగా వాహనాలు ఇవ్వకుండా సహకరించాలని కోరారు. వేసవిలో చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

హైస్కూల్‌గా మార్చాలని ధర్నా



ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

సోమశిల : అనంతసాగరం మండలం పడమటికంభంపాడు ఎస్సీ కాలనీలో ఉండే ఎంపీయూపీ పాఠశాలను హైస్కూల్‌గా మార్చాలని తల్లిదండ్రులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ ఎనిమిదో తరగతి వరకు ఉన్న పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. తమ పాఠశాలలో మొత్తం 122 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి ఉన్నత విద్యను అందించాలన్నారు. దీనివల్ల గ్రామంలోని బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఊర్లో ఉన్నత విద్య అందుతుందన్నారు. ఉన్నతాధికారులు తగిన న్యాయం చేయాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి : కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 485 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 328 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 157 బేళ్లను తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి వి.మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.220 పలకగా, సరాసరి రూ.253.81 లభించిందన్నారు. వేలంలో 13 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

బత్తాయి సాగులో అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఉద్యానాధికారిణి జయశ్రీ

ఉదయగిరి : వేసవి నేపథ్యంలో బత్తాయి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అప్రమత్తత అవసరమని ఉద్యానవన అధికారి జయశ్రీ తెలిపారు. ఆమె మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బత్తాయి చెట్ల మొదళ్లలో వరిగడ్డి, వరిపొట్టు, ఎండిపోయిన ఇతర ఆకులను కప్పి నీటి ఎద్దడిని తగ్గించుకోవాలన్నారు. తేలికపాటి తడులను ఎక్కువసార్లు పెట్టాలన్నారు. చెట్టు బెట్టకు రాకుండా 20 గ్రాముల యూరియా ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వేరుకుళ్ల నివారణకు లీటరుకు రెండు గ్రాముల కార్బెండిజం ద్రావణాన్ని 20 లీటర్ల నీటిలో పోసి పాదులో పారించాలన్నారు. అదే విధంగా కోతకొచ్చిన బత్తాయి కాయలను ఆత్మకూరు, కావలి, కందుకూరు, నెల్లూరు, పొదలకూరు మార్కెట్ యార్డు కేంద్రాల్లో విక్రయించవచ్చని తెలిపారు.

దుత్తలూరు ఎంపీడీఓగా హనుమంతరావు



దుత్తలూరు : మండల నూతన ఎంపీడీఓగా పి.హనుమంతరావు నియమితులయ్యారు. దీర్ఘకాలిక సెలవులో ఉన్న ఆయన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించినట్లు సిబ్బంది తెలిపారు.

పూలే, రమాబాయిల విగ్రహావిష్కరణ



ఆత్మకూరు : పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో జ్యోతిరావు పూలే, రమాబాయిల విగ్రహాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పేదలకు విద్యను చేరువ చేసేందుకు వారు చేసిన కృషిని పలువురు దళిత నాయకులు కొనియాడారు. ప్రిన్సిపల్ కామేశ్వరి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, న్యాయవాది నందా ఓబులేసు, రిటైర్డ్ ఆర్‌ఐ రవి, ఉపాధ్యాయులు పాణెం పెంచలయ్య, పట్టెడ మురళి, కొండయ్య, బాలయ్య పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో నేల సారవంతం



ఆత్మకూరురూరల్ : అవగాహన కల్పిస్తున్న డీఏఓ సత్యవాణి

ఆత్మకూరురూరల్ : రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా రాబోయే సీజన్‌లో పంటలు సారవంతంగా పండించి అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారిణి(డీఏఓ) సత్యవాణి అన్నారు. మండలంలోని వాశిలిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మంగళవారం పాల్గొని, మాట్లాడారు. వరికి ప్రత్యామ్నాయంగా చేయాల్సిన సాగుపై రైతులకు వివరించారు. వరికోతలు పూర్తయిన భూముల్లో నేల సారం కోల్పోకుండా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, వేరుశనగ లేదా పెసర, మినుము, నువ్వు పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని సాయిల్ హెల్త్ కార్డు పొందాలని తెలిపారు. ఏడీఏలు నర్సోజిరావు, దేవసేన, శేషగిరిరావు పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఏఓ కిశోర్‌బాబు, వీఏఏ ఈశ్వరయ్య, స్థానిక నాయకుడు పద్మయ్య నాయుడు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

సోమశిల : అనంతసాగరం మండలంలోని ఆమనిచిరువెళ్ల, గొరవరం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షల ప్రాముఖ్యత, వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో రైతులు వారి వ్యవసాయ సహాయకుల ద్వారా భూసార పరీక్షలు కోసం మట్టి నమూనాలు తెచ్చి ఇవ్వాలని తెలిపారు. అదేవిధంగా వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలైన సజ్జలు వంటి చిరు ధాన్యాలు వేసుకోవడం వల్ల భూమిలోతు పొరల్లో ఉండే పోషకాలు మొక్కలకు అందుబాటులోకి వస్తాయన్నారు.

- **మర్రిపాడు :** మర్రిపాడు, పల్లవోలు గ్రామాల్లో రైతులు వారి పొలంలో మట్టి నమూనాలను ఏ విధంగా సేకరించాలో ఏఓ రామ్మోహన్ రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పోషక లోపాలు గుర్తించి ఎరువులు ఎంత మోతాదులో వేసుకోవాలో తెలుసుకోవచ్చని, అదే విధంగా చౌడు భూములను గుర్తించి వాటిని సరి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు లహరి, సురేష్ రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



చేజర్ల : గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

ఆత్మకూరు(చేజర్ల): గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సురేఖ తెలిపారు. మండలంలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలను మంగళవారం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఆరోగ్యం చేకూరే ఆకుకూరలు, పాలు, గుడ్లు, మొలకెత్తిన విత్తనాలు తదితర పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు.

- **సోమశిల :** అనంతసాగరం మండల పరిధిలోని కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, లక్ష్మి, యానాదమ్మ, రత్తమ్మ పాల్గొన్నారు.
- **సంగం :** మండల పరిధిలోని పెరమన అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహార ఆవశ్యకతపై సీడీపీఓ సునీలత మంగళవారం అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.
- **కొండాపురం :** పౌష్టికాహారం ద్వారానే తల్లీబిడ్డల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. మండలంలోని కోవివారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవ ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పావని, పి.సుజాత, కె.విజయమ్మ, పి.సురేఖ పాల్గొన్నారు.



సోమశిల : కొత్తపల్లిలో..



సంగం : పెరమనలో..

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే



ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

సీతారామపురం : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని జయపురం గ్రామంలో రీసర్వేపై రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన మంగళవారం ర్యాలీ నిర్వహించారు. రైతులు భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలన్నారు. సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో రాజా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి మృతి



మహేష్ (ఫైల్)

అనుమసముద్రంపేట : తప్పిపోయిన ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల వివరాల మేరకు.. ఏఎస్‌పేట మండలం కొండమీదకొండూరు గ్రామంలో 45 రోజుల క్రితం గ్రామానికి చెందిన మాదాల మహేష్ (24) కనిపించకుండా పోయారు. అతనికి మతిస్థిమితం లేకనే గ్రామం విడిచి వెళ్లిపోయాడని అప్పట్లో భావించి గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో స్థానిక ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే మంగళవారం స్థానికులు కొందరు గ్రామంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో అస్థిపంజరం ఉండడాన్ని గుర్తించారు. సెల్‌ఫోన్, చెప్పులు, దుస్తుల ఆధారాలతో మాదాల మహేష్‌గా గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి వెళ్లి నిర్ధారించారు.